# విజ్ఞత

- పి.జి.కె.మూర్తి



సార్!

అరమోడ్పు కళ్ళతో ఎదురుగా నిలుచున్న అటెండర్ నాగుల్ని చూశాడు ఆనందరావు.

"ఎక్కడున్నారు?" అడిగాడు ఆనందరావు కూర్చున్న తీరును కాస్త మారుస్తూ

"పోగడ చెట్టు నీడన కారు ఆపారు సార్!"

"అలాగా!" నోటితో మాట్లాడుతూ నొసలు చిట్లించి గోడ మున్న గడియారాన్ని చూశాడు. అందులోని రోమన్ అంకెలు లంచికి మరో అయిదు నిముషాలున్నాయన్నట్టు సూచించాయి. సీట్లోంచి లేచి కళ్ళ నొకమారు నులుముకుని బల్లమీద వున్న సులోచనాలను తగిలించుకుంటూ నాగుల్ని వోర కంట చూసి "అయ్యగారు....?"

"భోజనానికి వెళ్ళి పోయారు!"

ఆ మాటతో ఆనందరావు ముఖం ఆనందాన్ని సంతరించుకుంది. సన్నగా కూని రాగం తీస్తూ నిద్రావస్తలో జారిపోయిన ఫాంటును ఎగలాగి, చెదిరిన ఇన్‌షర్ట్‌ను సవరించుకుంటూ సీటును వదిలి బయటకు నడిచాడు.

పోగడ చెట్టు నీడలో 'ఇండిక' కారు - దాంట్లో స్టీరింగ్ ముందు ఠీవిగా కూర్చున్న బ్రిడ్జి రాజుగారు తనవంకే ఆసక్తిగా చూస్తుండటం గమనించిన ఆనందరావు కారును సమీపించకుండానే చేతులు జోడించాడు.

"ఏమోయ్ ఆనందరావ్! బాగున్నావా!" గోల్డు ఫ్రేం కళ్ళద్దాలను సవరించుకుంటూ లీలగా నవ్వాడు.

అలా నవ్వుతున్న ఆయన నోటిలోని ముందు వరుస బంగారు పళ్ళు తళుక్కున మెరిశాయి.

ఆ నవ్వుకి నారిసారించిన విల్లులా వంగిపోయాడు ఆనందరావు.

సమయం రెండు గంటలన్నట్లుగా చేరువలో వున్న పోలీసు ఠాణాలో గంటమోగింది.

"శుభం! కారెక్కు! అలా లంచికి వెళ్ళివద్దాం!"

ఠక్కున కారుకు ప్రదక్షిణ చేసి కార్లో రాజుగారి ప్రక్కగా కూర్చున్నాడు.

కారు మెత్తగా కదిలింది.

రాజుగారి గోల్డు చైన్ రిస్ట్ ఆనందరావు భుజం మీద పడింది.

ఆనందరావు వళ్ళు ఝుల్లుమంది.

కారు హోటల్ ముందాగింది.

రాజుగారు ముందు నడుస్తుంటే ఆయన వెనుక జాగిలంలా అనుసరించాడు ఏ.సి రూంలోకి "వెజ్జా - నాన్ వెజ్జా!" అడిగారు రాజుగారు కూర్చుంటూ.

ఆనందరావు తేల్చుకునే లోగానే బేరర్ వచ్చాడు.

భార్య ఇచ్చిన 'హాట్ క్యారియర్' సంగతటుంచి

భారీగానే భోజనం ముగించాడు.

"చాల మొహమాట పెట్టేశారు" కార్లో కూర్చుంటూ విధేయతగా అన్నాడు.

"నువ్వసలేం తిన్నావయ్యా!" నవ్వారు రాజుగారు.

కారు రోడ్డు మీదకు వచ్చింది.

రాజుగారి చెయ్యి లాల్చీ జేబులోంచి బయటకు వచ్చింది.

ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్న ఆనందరావు ఆబగా అటు చూశాడు.

రాజుగారి వుంగరాల వ్రేళ్ళ నడుమ ఐదువందల రూపాయల నోటు కొత్తది తళుక్కుమంది.

"నువ్వు అందించిన ఇన్‌ఫర్‌మేషన్ వల్ల నా బిల్లులు చెక్కుల రూపం దాల్చాయోయ్. ఆనందరావ్!" రాజుగారి చేయి ఆనందరావు భుజం మీదుగా వాలి అతని షర్ట్ పాకెట్లోకి జారింది.

ఆనందరావు చూపు అటుగా మళ్ళింది.

"బ్యాంకు వాళ్ళిచ్చిందె చెల్లుతుంది! సందేహించకు!"

ఆనందరావు మౌనం వహించాడు.

"బిల్సు రానివ్వు చూద్దాం మళ్ళీ!"

కారు రోడ్డు మీద దొర్లి పోతూనే వుంది.

ఆగింది కారు.

ఆనందరావు రాజుగార్కి మరోసారి కృతజ్ఞతగా నమస్కరించి దిగాడు.

సాయంత్రం 'కరాచీ వాలా షాప్' మలుపు తిరుగుతుండగా ఉదయం ఇంటి వద్ద జరిగిన విషయం గుర్తుకు వచ్చింది.

ఉదయాన్నే ఆనందరావు పేపరు చూస్తున్నాడు.

భార్య వసంత కాఫీ కప్పుతో సమీపించి టీపాయ్ మీద వుంచి ఆనందరావు ప్రక్కగా కూర్చుని రిమోట్‌తో టీ.విని ఆన్ చేసింది.

న్యూస్ ముఖ్యాంశాలు.

'గుజరాత్ భూకంప బాధితులకు విరివిగా సహాయ సన్నాహాలు.....'

"ఆ! అన్నట్టు బాబు కాన్వెంట్ వాళ్ళు భూకంప బాధితుల సహాయార్థం 'నిధి'ని ఏర్పాటు చేస్తున్నారని చెప్పాడు.

"ఊ!" కాఫీ సిప్ చేస్తూనే అన్నాడు ఆనందరావు.

"ఊc! అంటే ఎలా!"

ఆనందరావు కాఫీ త్రాగడం ఆపి వసంతను చూశాడు. "మొన్న బ్రిడ్జి రాజుగార్కి కలసి వచ్చే ఇన్‌ఫర్‌మేషన్. అదె బడ్జెట్ వచ్చిందని అందించాను. దాంతో ఆయన బల్లులు చెక్కులు అవుతాయి. ఆయన ఈ రోజు వస్తారు ఆఫీసులకి. ఆయన ఎంతో కొంత ప్రతిఫలంగా ఇస్తారు. అది వాణ్ణి గుజరాత్ భూకంప బాధితులకు అందించమను." మాట పూర్తి చేసి లేచి స్నానానికి వెళ్ళిపోయాడు.

ఆనందరావు 'క'రాచీ వాలా షాపు'ను దాటి యింతి ముఖం పట్టేశాడు.

రాత్రి భక్షజనం చేస్తుండగా వసంత తిరిగి నిధిని గురించి గుర్తు చేసింది.

ఆనందరావు షర్ట్ జేబులో వున్న కొత్త అయిదువందల నోటు తీసి భార్యకందించాడు.

"మీరు లంచంగా తీసుకున్న ఆ డబ్బును నేను పవిత్రమైన కార్యానికి ఇవ్వను" డైనింగ్ టేబుల్ దగ్గర అమ్మా నాన్నల మధ్యగా కూర్చున్న అనంత్ స్పష్టంగా అన్నాడు.

"అది లంచమని ఎవరు చెప్పారు." ఆనందరావు కస్సుమన్నాడు.

"మీరు ఉదయం అమ్మతో చెప్పిందంతా విన్నాను." బుంగమూతి పెట్టాడు అనంత్.

వసంత భార్తనదోలా చూసింది.

తను లేచి స్నానానికని వెడుతుండగా షూస్ వేసుకుంటూ అక్కడే వున్న అనంత్ కనిపించిన సంగతి గుర్తుకు వచ్చింది ఆనందరావుకి.

"ఆ డబ్బు ఇవ్వను. ఇంతవరకూ నేనె కాన్వెంట్‌లో అందుకున్న వెండి కప్పులు, మెడల్సు మా ప్రిన్సిపాల్ గారు గుజరాత్ భూకంప బాధితుల సహాయ నిధిగా ఇస్తాను." స్థిరంగాను, ధైర్యంగానూ చెప్పాడు అనంత్.

వసంత అప్రతిభురాలైపోయింది. చేతిలో వున్న ఐదువందల నోటును భర్తకు తిరిగి అందించింది సున్నితంగా.

ఆనందరావు ముఖం వివర్ణమయింది. కొడుక్కి వున్న పాటి విజ్ఞత తనకు లేకపోయిందే అనుకుంటూ కుంచించుకుపోయాడు.

ఐదువందల నోటు అతన్ని వెక్కిరిస్తున్నట్టుగా ఎడమచేతి వ్రేళ్ళనడుమ రెపరెపలాడింది.

❀


**త్వరలో ప్రారంభం!**

**కొత్త శీర్షిక**

# కెరీర్ కౌన్సిలింగ్

ప్రియదత్త సకుటుంబ సచిత్ర వార పత్రికలో యువతరానికి అత్యంత ఉపయోగకరమైన సరికొత్త శీర్షిక "కెరీర్ కౌన్సిలింగ్" ని త్వరలో ప్రారంభించపోతున్నామని తెలియచేయటానికి సంతోషిస్తున్నాము.

క్రమం తప్పకుండా ప్రతివారం ప్రచురించే ఈ శీర్షికని ప్రస్తుతం 'కెరీర్ గైడ్' శీర్షికని నిర్వహిస్తున్న డా.కుమార్ అన్నవరపు, ఎం.ఏ(హిస్టరి), ఎం.ఏ(సోషియాలజి), ఎం.ఫిల్., బి.ఎల్., పి.జి.డి.పి.ఆర్., పి.హెచ్‌డి నిర్వహిస్తారు. పాఠకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఆశిస్తున్నాము.

మీ కెరీర్‌కి, ఉద్యోగావకాశాలకి సంబంధించిన ప్రశ్నలని 'కెరీర్ కౌన్సిలింగ్' శీర్షిక పేర సంపాదకుడు, ప్రియదత్త సకుటుంబ సచిత్ర వార పత్రిక, ఆంధ్ర ప్రచురణ ప్రైవేట్ లిమిటెడ్, పోస్ట్ బ్యాగ్‌నెం.399, మైలాపూర్, చెన్నయ్- 600 004 చిరునామాకి ఈ క్రింది కూపన్ జతపరచి పంపగలరు.

కూపన్

**ప్రియదత్త**

సకుటుంబ సచిత్ర వార పత్రిక

**"కెరీర్ కౌన్సిలింగ్"**

ప్రశ్న పంపిన వారి పేరు :------------------------------------------------

పూర్తి చిరునామా :------------------------------------------------

------------------------------------------------

---------------------------- పిన్‌కోడ్ ----------------------